క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని బీసీ బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా ఎస్పీ బి.ఆర్.రాధిక సూచనల మేరకు అమలు చేస్తున్న 'చిన్నారికి చేదోడు' తరఫున పరీక్ష సామగ్రిని కంచిలి మిత్ర బృందం మంగళవారం అందజేశారు. సాయం అందించిన వారిలో సాలిన మోహనరావు, గుడియా శ్రీనివాసరావు, గుడియా సురేష్, సాహుకారి సంతోష్, పకీరు, వంకల సంతోష్ ఉన్నారు. చిన్నారికి చేదోడు కౌన్సిలర్లు సాహుకారి సోమేశ్వరరావు, మునకాల కృష్ణమూర్తి ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

మందస: సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయాధికారి గుంట మురళీ అన్నారు. పుచ్చపాడు, డబారు గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ సేవా శిబిరంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై వలంటీర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. పొలంబడి నిర్వహించారు. పూర్వీకులు వ్యవసాయంలో అవలంబించిన పద్ధతులు ఇప్పుడు కొనసాగించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ముందుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి వీధులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, పీవో సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నీ ఓటు..నీ భవిష్యత్తుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వెలుగు సిబ్బంది 'నీ ఓటు.. నీ భవిష్యత్తు'పై మంగళవారం అవగాహన కల్పించారు. పూండిలోని స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో వాల్ పోస్టర్‌లను అతికించి ఖాతాదారులు, సిబ్బదికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీ ఇప్పిలి ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ డి.మహేష్, పి.రాజేష్, బ్యాంక్ సిబ్బంది, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పెంటిపద్ర గ్రామంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ మూడో వార్డు పెంటిపద్ర గిరిజన గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాశీబుగ్గ ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల విద్యార్థులచే జాతీయ సేవాపథకంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రవీణకుమారి శిబిరాన్ని ప్రారంభించగా.. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పెంటిపద్ర, జయరాంచంద్రపురం, పద్మనాభపురం గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఎన్ఎస్ఎస్ పీవో మాధవి, జయమ్మ, ఆనందరావు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.సుదర్శన్ దొర కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉందాం

- జోరుగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం

వజ్రపుకొత్తూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతోపాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అధిష్టానవర్గం ప్రకటించింది. దీంతో పార్టీ విజయం కోసం శ్రేణులు కదనరంగంలోకి దూకారు. గ్రామాల్లో పర్యటిస్తూ మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతూ ప్రచారాన్ని చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేకూరిన లబ్ధిని వివరించి ఓటును అభ్యర్థించారు. వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి గ్రామంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంగళవారం ఇంటింట ప్రచారం చేపట్టారు. ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుని అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పలాస అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ హేమంత్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.గుర్యయ్యనాయుడు ఉన్నారు.

పూండి ఉద్దానంలో..

వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపినాథపురంలో పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీదిరి అప్పలరాజుకు మద్దతుగా సర్పంచ్ కర్ని శ్రీను, మండల ప్రత్యేక ఆహ్వానితుడు, పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నేతలంతా ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల స్వర్ణయుగ పాలన గుర్తు చేస్తూ చేసిన మేలును మర్చిపోవద్దని, మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా సీదిరి అప్పలరాజు, ఎంపీగా పేరాడ తిలక్‌లను కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల హరినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు కర్ని లోకనాథం, కర్ని జోగారావు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: ప్రచారం చేస్తున్న ఎంపీపీ నీలవేణి, నాయకులు

బంటుకొత్తూరులో..

పలాస: సీదిరి అప్పలరాజుకు మద్దతుగా పలాస మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు, పార్టీ మండల అధ్యక్షుడు పైల చిట్టిబాబు ఆధ్వర్యంలో బంటుకొత్తూరు పంచాయతీలో ప్రచారం చేశారు. బంటుకొత్తూరుతో పాటు నీలిబద్ర, కేశపురం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. బ్రాహ్మణతర్లా ఎంపీటీసీ మాజీ సభ్యుడు దంతం వైకుంఠరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు జి.మోహనరావు, బంటుకొత్తూరు సర్పంచి షణ్ముఖరావు ఉన్నారు.

మందస మండలంలో..

మందస: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మందస పీఏసీఎస్ చైర్మన్ అగ్గున్న సూర్యారావు, కొత్తపల్లి సర్పంచ్ సేనాపతి దివ్య కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు కర్రి తిరుమల, కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ, పార్టీ నాయకులు సేనాపతి ఈశ్వరరావు, కర్రి వెంకటరావు, పైల నారాయణరావు, పి.రాము, బాడ భాస్కరరావు ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: గోపినాథపురంలో ఇంటింటా ప్రచారం చేపడుతున్న పార్టీ శ్రేణులు

గరుడబద్రలో..

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర గ్రామంలో పార్టీ శ్రేణులు ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ గూడ గిరిజ, పార్టీ నాయకుడు ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, నాయకులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పలాస నియోజకవర్గ అభ్యర్థి సీదిరి అప్పలరాజును గెలిపించాలని కోరారు.



పలాస: బంటుకొత్తూరులో నాయకుల ప్రచారం



మందస:ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో ప్రచారం చేస్తున్న నాయకులు

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు చేరువయ్యావని ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ అన్నారు. ఎక్కల, బెల్లుపడ పంచాయతీల్లో ఆమె మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామస్తులతో, ఉపాధిహామీ పథకం వేతనదారులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిని, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దు కేశవ పాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఎక్కల పంచాయతీ సర్పంచ్ రంగాల గాయత్రీ, బెల్లుపడ సర్పంచ్ అయుధం జయరాం ఉన్నారు.



బెల్లుపడ గ్రామస్తులతో సమావేశమైన పిరియా విజయ

'ఫ్యాన్' ప్రజలకు అండ



అవ్వతో మాట్లాడుతున్న పిరియా విజయ

సోంపేట: ఫ్యాన్ గుర్తు ప్రజలకు అండగా నిలుస్తోందని ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పిరియా విజయ అన్నారు. రుషికుద్ద, ఇస్కలపాలెం పంచాయతీల్లో ఎంపీపీ నిమ్మన దాస్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరువ చేశారన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, మత్స్యకార డైరెక్టర్ మద్దు రాజారావు, జేసీఎస్ అధ్యక్షుడు బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ సంది సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు బైపల్లి కామమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ బైపల్లి రామారావు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామ దేవత ముత్యాలమ్మ సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండాల భానమ్మ వంశీయులు ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలో కవిటి కళాకారులు నృత్యాలతో అలరించారు. సన్నాయి మేళంతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.



కాళీమాత వేషధారణతో ముత్యాలమ్మ ఊరేగింపు

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

కంచిలి: మండలంలోని ఒడిశా సరిహద్దు గ్రామం ఘాటీముకుందాపురం వద్ద సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు, తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, సారా, గంజాయి తదితర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా పట్టుబడినట్లైతే తక్షణమే అధికారులకు సమాచారం అందించి, తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేశ్వరరావు, స్థానిక ఎస్సై రాజేష్ ఉన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

ఓటు హక్కుపై అవగాహన

నందిగాం: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని.. అలాంటి ఓటును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని డీటీ భాగ్యలక్ష్మీక్ష్మీ, ఏపీఎం జాంభవతి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం నందిగాంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ చేపడుతూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. రానున్న తరాల భవిష్యత్ మనం వినియోగించే ఓటును బట్టే ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సింహాచలం, ఆర్ఐ కిరణ్, జూనియర్‌అసిస్టెంట్ రమేష్, ఆర్.శ్యామలరావు, చిన్ని కృష్ణ, సీహెచ్ లీలావతి, బి.హరిప్రియ, నీలవేణి, తిరుమలాదేవి, రజిని పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న మహిళలు

కోడ్ కూసిన వేళ..

కాశీబుగ్గ: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోడ్‌ను కఠినంగా అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా రాజకీయ నాయకుల వాల్‌పోస్టర్లు, కటౌట్లు తొలగిస్తున్నారు. అలాగే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 31వ వార్డులో ఉన్నటువంటి పలువురు నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది మంగళవారం ముసుగులు తొడిగారు. అలాగే సంతమైదానం, కేటీరోడ్డుతో పాటు పలాస, కాశీబుగ్గ పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి నాయకుల విగ్రహాలు, ఫొటోలకు ముసుగులు తొడికి కనిపించకుండా పేపర్లను అతికిస్తున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న పలాస ఆర్డీవో భరత్ నాయక్ పర్యవేక్షిస్తున్నారు.



దివంగత అప్పయ్యదొర విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

అపోటా మండల అధ్యక్షుడిగా కేశవ పురియా



నూతన కార్యవర్గ సభ్యులు

కవిటి: మండలంలోని ఒడియా ఉపాధ్యాయుల అపోటా మండల శాఖ అధ్యక్షుడిగా కేశవ పురియాను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాలాలపుట్టుగ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి అధ్యక్షతన మండలశాఖ కార్యవర్గం ఎన్నికను మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కేశవ పురియా, ఉపాధ్యక్షుడిగా లింగరాజు పట్నాయక్, కార్యదర్శిగా మనోజ్‌కుమార్ మహారణ, సంయుక్త కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్ గౌడ, కోశాధికారిగా ఉషాకిరణ్ గౌడ, కార్యనిర్వాహక సభ్యులుగా వై.బాలరాజు, బి.దేవదాసు, తారిణి ప్రధాన్, తుసల ప్రధాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ నూతన కమిటీకి అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంఘ ప్రతినిధులు ప్రమోద్‌కుమార్ పాడి, బేసి కృష్ణమూర్తి, లావణ్య పాతిక అభినందనలు తెలియజేశారు.

హిందీ పరీక్షకు 50 మంది గైర్హాజర్

పలాస: పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం హిందీ పరీక్ష జరిగింది. పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 1589 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 1539 మంది హాజరయ్యారని పలాస ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాదయ్య



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన జె.సాదయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాయకరావుపేట జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. కళాశాల సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు..

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ధర్మనీలాపురంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 సేవా శిబిరం కొనసాగుతోంది. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై మంగళవారం అవగాహణ కల్పించారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి శివప్రసాద్ ఆన్‌లైన్ మోసాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగాన్ని వివరించారు. అనంతరం సాయంత్రం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని సేంద్రియ వ్యవసాయం గురించి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.టి.గోవిందమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో డి.వాసుదేవరావు ఉన్నారు.

ఇంటింటికీ కుళాయి పనులు ప్రారంభం



పైపులైన్ పనులు జరుగుతున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి కోసంగిపురంలోని జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు కోసం పనులు జోరుగా జరుగుతున్నాయి. రెండు వేలకుపైగా ఇళ్ల నిర్మాణాలు ఇక్కడ చేపడుతున్నారు. ప్రతీ ఇంటికి మంచినీరు అందించాలనే ప్రభుత్వ తలంపుతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు.

యాగంతో పుణ్యఫలం

ఇచ్ఛాపురం రూరల్: ఎక్కడ యాగం జరుగుతుందో అక్కడ పుణ్యం సిద్ధిస్తుందని శ్రీకూర్మం పుణ్యక్షేత్ర ప్రధానార్చకులు వరదాచార్యులు అన్నారు. సన్యాసిపుట్టుగలో కల్యాణ వెంకటేశ్వర ఆలయ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా వేదపండితులు యాగశాలార్చన కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి విగ్రహాలను ప్రత్యేక పల్లకిలోఉం ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాగశాలార్చన పూజలు చేస్తున్న పండితులు

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



బంటుకొత్తూరులో ప్రచారం చేస్తున్న నాయకులు వెంకటరావు, షణ్ముఖరావు



అల్లుకోలలో ప్రచారం చేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయి క్రిష్ణ అన్నారు. అల్లుకోల పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన డాక్టర్ సీదిరి అప్పలరాజుకు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. అల్లుకోల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి, ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు పాల్గొన్నారు. అలాగే పలాస మండల పార్టీ అధ్యక్షుడు పైల వెంకటరావు అధ్వర్యంలో బంటుకొత్తూరులో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ప్రభుత్వ విప్ గండు మోహనరావు, సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు, దంతం వైకుంఠరావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జలుమూరు: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో జలుమూరు మండల కేంద్రంతోపాటు ముఖ్య కూడళ్లు అయిన చల్లవానిపేట, శ్రీముఖలింగం, కొమనాపల్లి వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను మంగళవారం తనిఖీ చేపట్టారు. జలుమూరు వంశధార కాలవ వద్ద సరుబుజ్జిలి, హిరమండలం, శ్రీముఖలింగం నుంచి వస్తున్న వాహనాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. డీటీ తిరుపతిరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. మద్యం, గంజాయి అక్రమ రవాణాతోపాటు అధికంగా డబ్బును తీసుకువెళ్తే తగిన పత్రాలు చూపించాలన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రభుత్వ సేవలపై సర్వే

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ విద్యార్థులు ఎస్ఎంపురం, ఎచ్చెర్లల్లో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ముకుందరావు, పీవోలు ఈశ్వరరావు, సింహాచలం పర్యవేక్షించారు.



ఎచ్చెర్లలో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పొగతో అవస్థలు!

నరసన్నపేట: మేజరు పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో సమీప జగన్నాథపురం వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది మంగళవారం మంటలు, పొగను అదుపు చేశారు. పంచాయతీ ఈఓ చిన్నారావు ఆధ్వర్యంలో ట్యాంకుల్లో నీటిని తరలించి మంటలను, పొగను అదుపులోనికి తీసుకువచ్చారు. ప్రతిరోజూ ఈ విధంగా మంటలను అదుపు చేయాలని జగన్నాథపురం వాసులు కోరుతున్నారు.